క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

కేసముద్రం: కేసముద్రంవిలేజ్ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన బానోత్ శివకుమార్ అనే విద్యార్థి ఈనెల 15నుంచి 17వ తేదీ వరకు తాండూరులో నిర్వహించనున్న ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం చీకటి వెంకట్రాంనర్సయ్య తెలిపారు. వరంగల్ జిల్లా నుంచి శివకుమార్ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా సీతారాంనాయక్



నెహ్రూసెంటర్: సీపీఎం పట్టణ కార్యదర్శిగా జిల్లా కేంద్రంలోని ఏటిగడ్డ తండాకు చెందిన బానోత్ సీతారాం నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ బుధవారం తెలిపాడు.

శ్రీవారి పవిత్రోత్సవాలు ప్రారంభం



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని రుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణు గోపాల స్వామివారి దేవస్థానంలో శ్రీవారి వార్షిక పవిత్రోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు సత్యంగౌతం మహారాజ్ జీ ఉదయాన్నే స్వామివారు, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి, పట్టువస్త్రాలు, విశేషంగా పూలమాలలతో అలంకరించి పూజలు చేశారు.

ఆర్థిక రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడిగా అనిల్‌గౌడ్



మరిపెడ రూరల్: తెలంగాణ పేదల ఆర్థిక రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడిగా మరిపెడ మండలం రాంపురం గ్రామానికి చెందిన చిర్ర అనిల్ గౌడ్ నియామకం అయ్యాడు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సింగారం ప్రేమ్‌కుమార్ కాకతీయ యూనివర్సిటీ కేంద్రంలో బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

20బస్తాల ధాన్యం అపహరణ

కేసముద్రం: రోడ్డుపక్కన ఆరబోసుకున్న 20 బస్తాల ధాన్యాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించిన ఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుగుర్తికి చెందిన కొమ్మనబోయిన భిక్షం అనే రైతు సాగు చేసిన వరిని ఇటీవల కోసి, ధాన్యాన్ని లాలూతండాకు వెళ్లే దారిపక్కన ఆరబోసుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు సుమారు 20బస్తాల ధాన్యం అపహరించారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత రైతు బుధవారం తెలిపారు.

రక్తదాన శిబిరం



డోర్నకల్: తలసేమియాల బాధితులకు ప్రభుత్వం అండగా ఉండాలని కాంగ్రెస్ మండల నాయకులు తాళ్లూరి గంగాధర్ కోరారు. మండలంలోని చిలుకోడు గ్రామంలో బుధవారం తాళ్లూరి బాబు యూత్ ఆధ్వర్యంలో తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ ఖమ్మం సహకారంతో తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రామారావు, ఉపేందర్‌గౌడ్, రాజు, ఉపేందర్ పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీ



నెల్లికుదురు: మండలంలోని మునిగలవీడు గ్రామంలోని చెరువులు, కుంటల్లో ప్రభుత్వం అందించిన రూ.1.60లక్షల విలువ చేసే మూడు రకాల ఉచిత చేప పిల్లలను పంపిణీ చేసినట్లు బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి సతీష్ యాదవ్ తెలిపారు. బుధవారం ముదిరాజ్‌లతో కలిసి చేపపిల్లలు చెరువులో వదిలిన అనంతరం ఆయన మాట్లాడారు. ముదిరాజ్‌లు ఆర్థికంగా బలపడేందుకు చేపపిల్లల పంపిణీపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. కార్యక్రమంలో రాజు, వెంకట్, యాకయ్య, ముదిరాజ్ పాల్గొన్నారు.

లక్ష దీపోత్సవానికి వేళాయె

- ముస్తాబైన శివాలయం
- రేపటినుంచి సుప్రభాత సేవతో పూజలు ప్రారంభం



విద్యుత్ దీపాలతో ముస్తాబైన శివాలయం

గూడూరు: మండల కేంద్రంలో కాకతీయుల కాలంలో నిర్మితమైన సనాతన శివాలయం కార్తీకశోభతో వెలుగొందుతుంది. శివకేశవులకు ప్రీతికరమైన కార్తీకమాసంలో ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఎక్కడాలేని విధంగా గూడూరు సనాతన శివాలయంలో ఏకశిలపై శివపార్వతుల విగ్రహాలు ఉండగా, మరో గర్భాలయంలో శివలింగం ఉంది. దీంతో భక్తులు ప్రతీ సంవత్సరం కార్తీక మాసంలో నెల రోజులు ఉదయం, సంధ్యా సమయంలో కార్తీక దీపాలతోపాటు శివలింగానికి పంచామృత అభిషేకాలు చేస్తూ, ప్రతీరోజు సాయంత్రం 7గంటలకు ఆలయ ధ్వజస్తంభంపై ఆకాశదీపాన్ని ఆవిష్కరిస్తున్నారు. అనంతరం రోజుకో రకంగా శివలింగాన్ని అలంకరిస్తూ భక్తిని చాటుకుంటున్నారు. కాగా ఈనెల 15వ తేదీ శుక్రవారం కార్తీకపౌర్ణమి కావడంతో ఆలయ కమిటీ నిర్వాహకులు రంగురంగుల విద్యుదీపాలతో అలంకరించారు. రేపు కార్తీక పౌర్ణమి ఉదయం 4గంటలకు సుప్రభాత సేవతో పూజలు ప్రారంభం కాగా, ఆలయ పూజారి సతీష్‌పాండ్యే కుటుంబ సమేతంగా హాజరైన భక్తులచే ఫల, పత్రపుష్పాలతో పంచామృత అభిషేకాలు నిర్వహిస్తారు. రాత్రి 7గంటలకు ఆలయ మండపంపై శివపార్వతుల కల్యాణం నిర్వహించిన తరువాత ఆలయ ప్రాంగణంలో లక్షదీపోత్సవాన్ని కనుల పండువలా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై శివపార్వతుల దీవెనలతోపాటు కార్తీక దామోదరుడి కృపాకటాక్షాన్ని పొందాలని ఆలయ చైర్మన్ డాక్టర్ ఏపూరు రవీందర్ రెడ్డి, కమిటీ సభ్యులు కోరుతున్నారు.



కొలువుదీరిన శివపార్వతులు



అర్ధనారీశ్వర అవతారంలో శివలింగం

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి



మహబూబాబాద్ రూరల్: ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 9నుంచి ప్రారంభించిన ఇంటింటి సమగ్ర సర్వేలో ఉపాధ్యాయులపై ఎలాంటి ఒత్తిడి, లక్ష్యాలు లేకుండా స్వేచ్ఛగా సర్వే పూర్తి చేసేలా చూడాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాచకొండ ఉపేందర్ అన్నారు. సర్వే చేస్తున్న ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని కోరుతూ టీపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీఓ రఘుపతిరెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాచకొండ ఉపేందర్ మాట్లాడుతూ.. రోజుకు 15నుంచి 20 కుటుంబాల సర్వే పూర్తి చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఒక్కో కుటుంబానికి 30నిముషాలు సమయం పడుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు అంటే 4గంటల్లో సగటున 8కుటుంబాల కంటే ఎక్కువ పూర్తి చేయడం సాధ్యం కాదని తెలిపారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు ఘనపురం భిక్షపతి, సీనియర్ నాయకులు బానోత్ రవీందర్, కడారి మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఎన్యుమరేటర్ల పనిభారం తగ్గించాలి

తొర్రూరు: కుటుంబ సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లకు పని భారం తగ్గించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలో సంఘం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నాగమల్లయ్య, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

డోర్నకల్: కుటుంబ సర్వేలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు పరిశీలించాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వై.సాయిబాబు, ఎంపీ రాజు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ శ్రీనివాసనాయక్‌కు వినతిపత్రం అందించారు.

పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన

కేసముద్రం: తమకు కట్నం కింద ఇచ్చిన ప్లాట్‌ను, ఓ వ్యక్తి ఆక్రమించాడని ఆరోపిస్తూ కేసముద్రంవిలేజ్‌కి చెందిన సోస్కండ్ల రాధిక అనే మహిళ మండల కేంద్రంలోని స్థానిక జ్యోతిరావుపూలే సెంటర్ సమీపంలో పెట్రోల్ బాటిల్‌తో బుధవారం ఆందోళనకు దిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. తమకు చెందిన భూమిని ఓ వ్యక్తి రిజిస్ట్రేషన్ చేసుకుని, మరొక వ్యక్తికి విక్రయించాడని ఆరోపించింది. అట్టి స్థలంలో చదును చేస్తుండగా పెట్రోల్ బాటిల్‌తో వెళ్లి ఆందోళనకు దిగింది. సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, ఆమెకు నచ్చజెప్పి శాంతింపజేశారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

కురవి: రోడ్డు ప్రమాదంలో ఆర్‌ఎంపీ వైద్యుడికి తీవ్రగాయాలైన సంఘటన సీరోలు మండలం కొత్తూరు(సీ)శివారు గుజిలి తండా వద్ద 365 జాతీయ రహదారిపై బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చిన్నగూడూరు మండలం మంగోరీగూడెం గ్రామానికి చెందిన నూనావత్ కృష్ణ అనే ఆర్‌ఎంపీ వైద్యుడు అయ్యగారిపల్లి వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. గుజిలి తండా వద్దకు చేరుకునే సమయంలో రోడ్డు పక్కన పోసి ఉన్న మట్టి కుప్పకు తగిలి బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. హెల్మెట్‌ను బైక్ పెట్రోల్ ట్యాంకు మీద పెట్టుకుని వాహనం నడుపుతున్నాడు. హెల్మెట్ తలకు పెట్టుకుని ఉంటే గాయాలు కాకపోయి ఉండేవి. వెంటనే 108లో మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

చెక్కు అందజేత

గార్ల: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన లక్ష్మికి మంజూరైన రూ.32వేల చెక్కును సీఎం ఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు బుధవారం బాధితురాలికి అందజేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామారావు అందజేశారు. నాయకులు కోటేష్, హనుమంతరావు, రామకృష్ణ, సుమంత్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి చేయూతనందించాలి



పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ లక్ష్మా

డోర్నకల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి దాతలు చేయూతనందించాలని ఎంఈఓ ఆంగోత్ లక్ష్మా కోరారు. సర్వ శిక్షా అభియాన్ స్టేట్‌ఫైనాన్షియల్ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.వెంకన్న మండలంలోని కన్నెగుండ్ల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ మెటీరియల్ పుస్తకాలను బహూకరించారు. బుధవారం పాఠశాలలో ఎంఈఓ లక్ష్మా, కాంప్లెక్స్ హెచ్‌ఎం రుక్మంగధరరావు పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీఎస్ హెచ్‌ఎంలు పరిపూర్ణాచారి, వెంకటేశ్వర్లు, వెంకటనర్సయ్య పాల్గొన్నారు. అమ్మపాలెం ఎంపీపీఎస్‌లో హెచ్‌ఎం శ్రీలక్ష్మి విద్యార్థులకు టై, బెల్టులను బహూకరించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..



పరామర్శిస్తున్న దయాకర్‌రావు

పెద్దవంగర: బాధిత కుటుంబాల అండగా ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అభయమిచ్చారు. మండలంలోని గంట్లకుంట పరిధిలోని అమర్‌సింగ్ తండాకు చెందిన తల్లికొడుకు జాటోతు వెంకన్న, శాంతమ్మ మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన చిలుక టైటస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ, నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా మజ్దూర్ యూనియన్



ప్రచారం నిర్వహిస్తున్న యూనియన్ నాయకులు

డోర్నకల్: దశాబ్దాల కాలంగా రైల్వే కార్మికులకు మజ్దూర్ యూనియన్ అండగా ఉంటూ అనేక సమస్యల పరిష్కారం కోసం పోరాడిందని మజ్దూర్ యూనియన్ అసిస్టెంట్ డివిజనల్ సెక్రెటరీ, సీసీఎస్ ప్రెసిడెంట్ చిలుకు స్వామి తెలిపారు. త్వరలో జరగబోయే ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో భాగంగా బుధవారం మజ్దూర్ యూనియన్ గుర్తు జెండాపై ఓటేసి గెలిపించాలని కోరుతూ డోర్నకల్ జంక్షన్ పరిధిలోని వివిధ కార్యాలయాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డోర్నకల్ బ్రాంచ్ సెక్రెటరీ అంజియాదవ్, చైర్మన్ చరణ్‌నాయక్, నాయకులు రాజేందర్, శోభన్‌ప్రసాద్, వీరన్న, కరణ్‌సింగ్, నాగశేషు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

పెద్దవంగర: ఇద్దరి వ్యక్తుల మరణానికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కాంత్రి కిరణ్ బుధవారం తెలిపారు. మండలంలోని గంట్లకుంట గ్రామ పరిధిలోని అమర్‌సింగ్ తండాకు చెందిన జాటోతు వెంకన్న, శాంతమ్మ తల్లి, కొడుకు తమ బంధువు సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల జలాల్‌పురం పరిధిలోని జేత్యానాయక్ తండాకు చెందిన చంద్రునాయక్ మృతి చెందగా పరామర్శకు వెళ్లి తిరుగు ప్రయాణంలో బైక్‌పై వస్తుండగా వడ్డె కొత్తపల్లి సమీపంలో తొర్రూరు–వలిగొండ ప్రధాన రహదారిపై వారిని కారు బలంగా ఢీ కొట్టింది. దీంతో వారు అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. మండలంలోని పోచారం గ్రామానికి చెందిన కారు డ్రైవర్ మద్దెల సాయితేజ అతి వేగంగా, అజాగ్రత్తతో కారు నడుపుతూ ఇద్దరి మృతికి కారణమయ్యాడని వివరాలు వెల్లడించారు. అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

గుడుంబా పట్టివేత

డోర్నకల్: మండలంలోని గొల్లచర్ల గ్రామంలో బుధవారం డోర్నకల్ పోలీసులు గుడుంబాను పట్టుకున్నారు. డోర్నకల్ ఎస్సై గడ్డం ఉమ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎస్సీ కాలనీలో పగిడిపల్లి పద్మ ఇంటిపై దాడి చేసి 8లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మహబూబాబాద్ రూరల్: గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. టౌన్ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మన్సూర్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి పడి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. మృతుడు భిక్షాటన చేసుకుంటూ తిరిగేవాడని తెలిసిందన్నారు. వయసు సుమారు 55 నుంచి 60 సంవత్సరాలు ఉండవచ్చని, మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మార్చురీ గదిలో భద్రపరిచామని తెలిపారు. ఎవరైనా గుర్తుపడితే టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ ఫోన్ నంబర్ 87126 56930, పోలీస్ స్టేషన్ నంబర్ 87126 56933 సమాచారం ఇవ్వాలని కోరారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గూడూరు: రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు మద్దతు ధర రావాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే లభిస్తుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండల కేంద్రంతోపాటు అయోధ్యపురం, సీతానగరం, లైన్‌తండా గ్రామాలలో బుధవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం అయోధ్యపురంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతన్నలకు మద్దతు ధర ప్రకటిస్తూ, రూ.500బోనస్‌ను ప్రకటించిందన్నారు. దొడ్డు రకం ధాన్యం కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నెక్కొండ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి, ఏడీఏ శ్రీనివాస్, ఏఓ అబ్దుల్‌మాలిక్, ఎంపీడీఓ వీరస్వామి, ఐకేపీ ఏపీఎం రవీందర్, కందిక రమేష్, రైతులు పాల్గొన్నారు.

చిల్లర కాంటాలను నియంత్రించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్: పట్టణంతోపాటుగా చుట్టుపక్కల గ్రామాల్లో ఏర్పాటు చేసిన చిల్లర కాంటాలను నియంత్రించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా), ప్రగతిశీల అఖిల భారత రైతు సంఘం (ఏఐపీకేఎస్) ఆధ్వర్యంలో మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ షంషీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి మాట్లాడుతూ.. ప్రైవేట్ కొనుగోలుదారులు వెలిసి రైతులను గందరగోళ పరిచి కొనుగోళ్లు చేపడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పైండ్ల యాకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు భిక్షం, నాగేశ్వరరావు, వీరస్వామి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో బంగారు పతకాలు



పతకాలు సాధించిన మానుకోట విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్: గోవాలో స్పార్క్ ప్రపంచ కప్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో రామన్ శ్లోక విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని పాఠశాల డైరెక్టర్ జాస్తీ ఉమాదేవి, కరస్పాండెంట్ రమణ తెలిపారు. విద్యార్థులు కర్పూరపు సాయి, సాయి హర్షిత్ గోల్డ్‌మెడల్, కర్పూరపు శ్రీగని సిల్వర్ మెడల్ సాధించారన్నారు. బుధవారం విద్యార్థులను అభినందించారు. స్పార్క్ కరాటే అకాడమిక్ చెందిన విద్యార్థులు పతకాలు సాధించారని కోచ్ మహ్మమద్ అమీర్ పాషా తెలిపారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన పాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సోమ విష్ణువర్ధన్ బాబు, ఉపాధ్యాయులు రామసహాయం శ్రీధర్‌రెడ్డి, ఉప్పలయ్య, కాసం శ్రీనువాసరావు, తిరుపతి, సతీష్ కుమార్, శిఖారాణి, ఝాన్సీ, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కులగణన దేశ వ్యాప్తంగా జరపాలి

కురవి: దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని రాజోలు గ్రామంలో సీపీఎం మండల మహాసభ జక్కుల మల్లయ్య, మాలోత్ కిషన్, కొమ్ము మంజుల అధ్యక్షతన జరిగింది. పార్టీ పతాకాన్ని కొంపెల్లి వీరయ్య ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, వెంకన్న, కోటయ్య, సుధాకర్, వెంకన్న, మల్సూర్, మనోహర్, భిక్షపతి పాల్గొన్నారు.

స్టడీమెటీరియల్ అందజేత

నెల్లికుదురు: 10వ తరగతి విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులకు ఎదగాలని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగమణి సూచించారు. మండలంలోని మునిగలవీడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మహబూబాబాద్‌కు చెందిన రాహుల్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించకుని బుధవారం స్టడీ మెటీరియల్‌ను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

నెల్లికుదురు: విద్యార్థులతో రాయడం, చదవడం, లెక్కలు చేయడం లాంటి ప్రాథమిక నైపుణ్యాలు పెంపొందించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ ఏ.రాందాస్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ఆలేరు హేమ్లాతండా, రావిరాల పాఠశాలలను బుధవారం ఎంఈఓ తనిఖీ చేశారు.

'కస్తూర్బా' నిర్వహణపై శిక్షణ

డోర్నకల్: కస్తూర్బా పాఠశాలలో వంట గదుల నిర్వహణతోపాటు వివిధ అంశాలపై బుధవారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో ప్రత్యేక అధికారులు, కేర్‌టేకర్లు, అకౌంటెంట్లకు జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డీఈఓ ఆదేశాల మేరకు శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా బాలికల ఈక్విటీ కోఆర్డినేటర్ పర్యవేక్షించారు.

జాతర పనులు త్వరగా పూర్తిచేయాలి

కురవి: కందికొండ గుట్ట జాతర పనులను త్వరగా పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్, మానుకోట మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ అన్నారు. బుధవారం కందికొండ గుట్ట వద్ద జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. కార్యక్రమంలో స్పెషల్ అధికారి ఇస్లావత్ లచ్చిరాంనాయక్, నాయకులు బండి శ్రీనివాస్, బండి లక్ష్మారెడ్డి, మలిశెట్టి వేణు పాల్గొన్నారు.

సంగీత పరికరాల అందజేత



కురవి: సీరోలు మండలం కాంపల్లి గ్రామంలో రేపాల వెంకన్నగురుస్వామి ఆధ్వర్యంలో శబరిపీఠం అయ్యప్పస్వాముల బృందం పాటలు పాడేందుకు అవసరమైన రూ.41వేల విలువైన మ్యూజిక్ పరికరాలను భక్తులు పులుసాని జ్యోతి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం అందజేశారు.

బాధ్యతల స్వీకరణ

దంతాలపల్లి: స్వయంకృషి మండల సమైఖ్య నూతన ఏపీఎంగా సంగ ఉపేందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన దివాకర్‌రాయ్ బదిలీపై డీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు.

ప్రత్యేక పూజలు

మరిపెడ రూరల్: కార్తీక మాసం పురస్కరించుకొని మండలంలోని అబ్బాయిపాలెం గ్రామ శివారు కొండపై గల అగస్త్యేశ్వర ఆలయంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అగస్త్యేశ్వర మహాముని కొండపై ప్రతిష్ఠించిన శివలింగానికి ఆలయ అర్చకులు ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో మాసబత్తిని సతీష్ దంపతులు మూలవిరాట్‌కు పంచామృత అభిషేకం చేశారు.

సంతాపం

మహబూబాబాద్ రూరల్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, స్వాతంత్ర సమరయోధుల వారసుల సంఘం జాతీయ కార్యదర్శి రాంపల్లి జయప్రకాష్ మాతృమూర్తి రాంపిళ్ల నరసాయమ్మ మృతికి స్వాతంత్ర్య సమరయోధులు బుధవారం సంతాపం తెలిపారు. స్వాతంత్ర్య సాధన అనంతరం కేంద్ర ప్రభుత్వ హోం మంత్రిత్వ శాఖ సలహా మండలిలో నరసాయమ్మ సేవలు అందించారని, ఆమె స్వాతంత్ర సమరయోధుల సమస్యల పరిష్కారం దిశగా కృషి చేశారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో భువనగిరి రవీంద్ర గుప్తా, సింగు రమేష్, తదితరుల పాల్గొన్నారు.

నివాళి

గార్ల: మండలంలోని సత్యనారాయణపురానికి చెందిన అమరుడు వేజెళ్ల సైదులురావు వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన స్మారకస్తూపం వద్ద సీపీఎం నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండా రాజన్న మాట్లాడారు. కార్యక్రమంలో గార్ల, బయ్యారం మండల కార్యదర్శులు సత్యవతి, మధు, నాయకులు బాబు, సత్యం, వీరస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త యిమ్మడి విజయకుమార్ మృతిచెందగా ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే మురళీనాయక్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఖలీల్, తదితరులు ఉన్నారు.

వెంటిలేషన్ ఉన్నచోట సిలిండర్ నిల్వ చేయాలి



మహబూబాబాద్ అర్బన్: ఇంట్లో గ్యాస్ సిలిండర్ ఉపయోగించినప్పుడు భద్రతను నిర్ధారించడానికి సరైన వెంటిలేషన్ ఉన్న ప్రదేశాలలో గ్యాస్ సిలిండర్‌ను నిల్వ చేయాలని హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ బోనగిరి ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వికాస్ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు హెచ్‌పీ గ్యాస్ సేఫ్టీ క్లినిక్‌పై అవగాహన నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ బోనగిరి ప్రసాద్ మాట్లాడుతూ.. సురక్షితమైన ప్రదేశాల్లో గ్యాస్‌ను ఉంచాలని, గ్యాస్ లీక్ అయినప్పుడు ఇంట్లో తలుపులు, కిటికీలు తీసి ఉంచాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బిక్కి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వీరన్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.